# శివరాత్రి ఉపవాసం

-ఐతా చంద్రయ్య
తపాల శాఖ
ఇ.నం.4-4-11,
శేరపూర,
సిద్ధిపేట-502 103.

## "రేపు శివరాత్రి కదండీ!"

భర్త ఆఫీసు నుండి రాగానే వేడి వేడి కాఫీ అందిస్తూ అంది కామాక్షి.

"ఐతే ఏపి. ఎటా!" ఒక చేత్తో కాఫీ కప్పందుకుంటూ మరో చేత్తో భార్య బుగ్గమీద చిటికేసి సోఫాలో సెటిలై పోయాడు కాంతారావు.

తియ్యని అనుభూతిలోంచి తేరుకుని "అబ్బే అది కాదండీ!" భర్త పక్కన కూచుంది.

"శివరాత్రినాడు ఉపవాసం చేస్తే కాశీలో గోవును దానంజేసినంత పుణ్యమట. రేపు మనంఉపవాసం ఉందామండీ" లాలనగా భుజమ్మీద చెయ్యేసింది.

"అంటే....!" ఐసై పోతున్నాడు కాంతారావు.

"రేపు మనం భోజనం మానేసి ఒక్కపూట టిఫిన్‌తో సరిపెట్టుకోవాలంతే! ఆ తర్వాత రాత్రికి జాగారం చెయ్యాలి."

కాంతారావుకు కంపరమెత్తింది.

"కొత్తగా పెళ్ళయిన వాళ్ళం గదా! ఇప్పట్నుంచే ఆ మహాయజ్ఞం మనకెందుకూ?"

"ఇప్పుడు కాకపోతే వయసుడిగింతర్వాతనా? అప్పటిదాకా బతుకుతామనే గ్యారంటీ ఏమిటీ? బతికున్నప్పుడే బలుసాకంత పుణ్యం మూట గట్టుకోవాలి. అంతే కాదు...."

ఆచార వ్యవహారాల గురించీ, ఉపవాసం వల్ల లాభాల గురించీ గంటసేపు ఉపన్యాసమిచ్చింది.

ఉపన్యాసాలు వినడం కంటే ఉపవాసముండడమే మేలనిపించి తలూపేశాడు కాంతారావు.

రిక్షాలో జంటగా బజారుకెళ్ళారు.

కందగడ్డ, మూడు రకాల పండ్లు, సత్తుపిండి సామాగ్రి, పూజా సామాగ్రి కొనుక్కుని ఆటోలో తిరిగొచ్చేసరికి వందనోటుకు రెక్కలొచ్చి ఎగిరి పోయింది. ఆటో దిగుతూ...

"చూశావా, నువ్వంటే నాకెంత ప్రేమో" అన్నట్టుగా నవ్వేశాడు.

కామాక్షి ముఖారవిందము టేబుల్ లాంప్‌లా వెలిగింది.

తెల్లవారింది, శివరాత్రి. ఆఫీసుకు సెలవు. ఉపవాస దీక్ష ప్రారంభమైంది.

పదయింది. కడుపులో పందికొక్కులు పరుగులు తీస్తున్నయ్. తట్టుకోవడం అసాధ్యమైపోతోంది కాంతారావుకు.



కాంతారావు, కామాక్షిల మధ్య ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో చర్చ జరిగింది. ఉపవాసాల నిబంధనల్లో స్వల్పమైన సడలింపు జరిగింది. కాఫీ కడుపులోకి జారుకుంది.

మూతి తిప్పుళ్ళూ, మోచేతి పొడుపుల మధ్య శివపూజా కార్యక్రమం పూర్తయ్యేసరికి మధ్యాహ్నం రెండైంది. ఆకలి కేకలు పెడుతోంది.రెండో దఫా చర్చా కార్యక్రమం ప్రారంభిద్దా మన్నాడు కాంతారావు.

"నాలుగయ్యేదాకా మౌనవ్రతం పాటించాలి. అందాకా మీరు మాట్లాడితే నన్ను చంపుకు తిన్నంత ఒట్టు."

కామాక్షి పరమేశ్వరి అవతారమెత్తింది. శివలీలలు పుస్తకం భర్త చేతికిచ్చింది.

సాయంత్రం నాలుగైంది.

"ఆకలి కాగలేను. ఛలో కామాక్షీ!"

చెంగున లేచి ఎండకువాడిన పండుటాకులా సోఫాలో కూలబడ్డాడు.

ఐదింటికి పండ్లూ, కంద గడ్డలూ, సత్తుపిండీ... ఆరగింపు జయప్రదంగా ముగిసింది.

"జాగరణ సరిగా చెయ్యకపోతే ఉపవాస దీక్షా ఫలితం దక్కదు. ఒక వీ.సీ.పీ. మూడు భక్తి సినిమా క్యాసెట్లు పట్టుకురండి." మరో ఆర్డర్.

బజార్లో వీ.సీ.పీ.ల షార్టేజి. ఊరంతా గాలిస్తే వంద రూపాయల అద్దెకు దొరికింది. వీ.సీ.పీ. ఆన్ చేస్తూంటే - వానాకాలం చెరువులోకి కప్పల్లా పక్కింటి జనాలు బిలబిలమంటూ వచ్చేశారు. వాళ్ళందర్నీ సాదరంగా ఆహ్వానించి కూచోబెట్టింది కామాక్షి.

భూకైలాస్, దక్షయజ్ఞం, పార్వతీ కళ్యాణం సిన్మాలు ముగిసే సరికి నాలుగైంది."

తెల్లారే సరికి స్నానాదులు ముగిస్తే సరి. జాగరణ దిగ్విజయం." అంటూ లేచింది కామాక్షి.

ఆవులిస్తూ వెళ్ళిపోయారు జనాలు.

"ఇహలేచి మొహం, స్నానాదులు. కానివ్వండి మహానుభావా!"

సోఫాలో ఒరిగి కూచున్న భర్త పక్కన జేరి కళ్ళలో కళ్ళు కలపబోయింది కామాక్షి.

గుర్ర్ర్... గుర్ర్ర్... గురక లయబద్ధంగా వినిపిస్తోంది.